వెంచర్లలో నిబంధనలు సమాధి

- వైసీపీ పాలనా కాలంలో అక్రమంగా ప్లాట్ల వ్యాపారం
- అనుమతులు లేకుండా వెంచర్లు
- ఉమ్మడి జిల్లాలో 230కి పైగా అక్రమ లే అవుట్లు
- కూటమి ప్రభుత్వం ఆదేశాలతో కొరడా ఝుళిపించిన అధికారులు
- అక్రమ వెంచర్ల కూల్చివేత



అక్రమ లేఅవుట్లను తొలగిస్తున్న అధికారులు(ఫైల్)

నంద్యాల ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

అనుమతుల్లేవు.. నిబంధనలు పాటించాల్సిన పని లేదు.. భూమి కనిపించిందా.. వెంచరు వేసేయటం.. ప్లాట్లు అమ్మేయటం. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళలో జరిగింది ఇదే! ప్రతి వెంచర్‌లో వైసీపీ నాయకులకు కమీషన్లు ముట్టాయి. దీంతో ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇదేం అన్యాయమని అడగలేదు. అధికారులకు అందాల్సినవి అందాయి. వారు నోరు మెదపలేదు. కానీ ఆ ప్లాట్లను కొన్నవారు దగాపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమ వెంచర్లపై కొరడా ఝుళిపిస్తోంది. ఇప్పటికే అక్రమ వెంచర్ల కూల్చివేతలు మొదలయ్యాయి. కమీషన్లు తీసుకున్న వైసీపీ నాయకులు, వ్యాపారులు బాగానే ఉన్నారు. వాటిని కొన్నవారు లబోదిబోమంటున్నారు.

నగరాలు, పట్టణాలు, మండలాలు అంటూ తేడా లేదు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా వెంచర్లు కనిపిస్తాయి. అయితే వీటిలో అనుమతులు, నిబంధనలకు లోబడి ఉన్నవి ఎన్ని అనేవి నిన్న, మొన్నటి వరకు ఎవరికీ తెలియదు. వైసీపీ ప్రభుత్వం వెంచర్ల తనిఖీ చేపట్టలేదు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్రమ లే అవుట్లు ఎన్ని ఉన్నాయనే ఆరా మొదలైంది. పట్టణాల్లో, మున్సిపాలిటీ, పంచాయతీ పరిధిలోని లెక్క తీయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో విస్తుపోయే నిజాలు బైటికి వస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 230 అక్రమ వెంచర్లు ఉన్నాయని అధికారులు లెక్క తీశారు. అయితే ఇదేమీ కొత్త సమాచారం కాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. గతంలోనూ అక్రమ వెంచర్లపై పలువురు ఫిర్యాదు చేశారు. అక్రమ వెంచర్ల యజమానుల నుంచి వైసీపీ నాయకులు రూ. కోట్లలో కమీషన్లు తీసుకుంటున్నారని, అధికారులు నిబంధనల మాటెత్తకుండా ఉండటానికి వ్యాపారులు లక్షల రూపాయాలు ఇస్తున్నారని గతంలో 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలు ప్రచురించింది. దీంతో గత వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులు, అధికారులు అక్రమ వెంచర్ల వైపు కన్నెత్తి చూడలేదు. అక్రమ వెంచర్ల విషయంలో అధికారులు నోటీసు బేనర్లు పెడితే .. వాటిని యజమానులు తొలగించినట్లు తెలు స్తోంది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వ ఆదేశంతో అధికారులు అక్రమ వెంచర్లను బయటకు తీయక తప్పడం లేదు. అయితే కమీషన్లు తీసుకున్న వైసీపీ నాయకులు, అధికారులు బాగానే ఉన్నారు గాని, అనుమతులు ఉన్నాయని నమ్మి ఈ వెంచర్లలో ప్లాట్లు కొన్న అమాయక ప్రజలు తీవ్రంగా నష్టపోనున్నారు.



అక్రమ లే అవుట్లను ధ్వంసం చేయిస్తున్న అధికారులు

అక్రమ లే అవుట్లను గుర్తించి..

ప్రస్తుతం అక్రమ లే అవుట్లపైన కొరడా ఝుళిపిస్తున్న అధికారులు నంద్యాలలో 79, నందికొట్కూరు 23, కర్నూలులో 35 మిగిలిన వాటిని ఉమ్మడి జిల్లాలోని వివిధ పట్టణాల్లో, మండలాల్లో గుర్తించారు. ఈ వెంచర్లలో ఎవరూ ప్లాట్లు కొనవద్దని, బ్యాంకులు రుణాలు ఇవ్వకూడదని అధికారులు నోటీసులు అంటించారు. అంతే కాకుండా కొన్ని చోట్ల అక్రమ వెంచర్లలో కూల్చివేతలు కూడా మొదలుపెట్టారు.



అక్రమ లే అవుట్ల కూల్చివేత సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ కృష్ణయ్యయాదవ్ (ఫైల్)

కన్వర్షన్ చెయ్.. వెంచర్ వెయ్

మధ్య తరగతి ప్రజలు ఇల్లు కట్టుకునేందుకు ప్లాట్లను కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. . దీన్ని అవకాశంగా తీసుకుని కొంతమంది ఇష్టారీతిన లే అవుట్లు వేశారు. అయితే వెంచరు వేయాలంటే పంట భూమిని, వ్యవసాయేతర భూమిగా మార్చాలి. మార్కెట్ విలువలో 5 శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. వెంచరులో రోడ్లు, పార్కు, ఖాళీ స్థలం ఉండాలి. చుట్టూ ఫైర్ ఇంజన్ వంటి వాహనాలు తిరగడానికి స్థలం వదలాలి. ఇలా చేస్తే ఎకరా భూమిలో దాదాపు 40 శాతం స్థలం పోతుంది. ఈ నిబంధనలు అన్నీ పాటిస్తే తమకు లాభం తగ్గుతుందని భావించిన వ్యాపారులు నిబంధనలు పాటించకుండా ప్లాట్లు వేశారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం దక్కలేదు. రిజిస్ట్రేషన్ శాఖ వెంచర్‌కు అనుమతి ఉన్నదీ లేదనిదీ చూసుకోకుండానే అక్రమ వెంచర్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తోంది. విద్యుత్ శాఖ కనెక్షన్లు ఇస్తోంది. మొత్తానికి తిలాపాపం తలాపిడికెడు అన్నచందాన అన్ని శాఖలు కలిసి ప్రభుత్వ ఆదాయానికి గండి పెట్టటమే కాకుండా సామాన్యులను ఇబ్బంది పెట్టాయి.



వారి పరిస్థితి ఏమిటి..?

అక్రమ వెంచర్ల వ్యవహారం ఇంత జోరుగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులకు, అభివృద్ధి శాఖ అధికారులకు తెలియడం లేదు. వెంచర్ వేయడం, ప్లాట్ల అమ్మకాలు, కొనుగోలు అంతా బహిరంగమే అయినా వైసీపీ పాలనా కాలంలో ప్రభుత్వానికి ఎందుకు పట్టలేదనే విమర్శ ఉంది. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ప్రస్తుతం అధికారులు తాము అక్రమ వెంచర్లను గుర్తించామని, వాటిలో ఎవరూ కొనుగోలు చేయకూడదని హెచ్చరికలు చేస్తూ బోర్డులు పెడుతున్నారు. దీని వల్ల వెంచరు యజమానులకు పోయేదేమీ లేదు. ఈ అక్రమ వెంచర్లలోని ప్లాట్లన్నీ ఇప్పటికే అమ్ముడుపోయాయి. సొంత ఇంటి కోసం డబ్బులు కూడబెట్టుకొని ప్లాట్లు కొనుక్కున్నవారే ఇబ్బందిపడాలి. అసలు వెంచర్లు అక్రమంగా వేసినప్పుడే అధికారులు గుర్తించి వాటికి అడ్డుకొని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ప్లాట్లను కొనుకున్నవారు ఆవేదన చెందుతున్నారు. ఇక ఇలాంటివి ఎన్ని జరిగినా, తమకు ఏమీ కాదని, మళ్లీ వెంచర్లు వేసే సమయంలో ఎవరికి ముట్టచెప్పాల్సినవి వారికి అందిస్తే, నిబంధనలు పాటించాల్సిన పని లేదని, అనుమతులు లేకున్నా ప్లాట్ల వ్యాపారం చేసుకోగలమని వెంచరు యజమానులు చెబుతున్నారంటే.. అధికారులు ఏ స్థాయిలో మామూళ్లకు అలవాటు పడ్డారో అర్థమవుతోంది. ఇలాంటి అధికారులు విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తేనే సామాన్యులు అక్రమ వెంచర్లలో డబ్బులు పెట్టి నష్టపోకుండా ఉంటారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 24: ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉచిత ఇసుక విధానం అమలుపై ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్‌తో కలిసి జిల్లా స్థాయి స్టాండ్ కమిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గనుల శాఖ ఏడీ రామచంద్ర, నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, డీటీసీ శివారెడ్డి, కెసీ కెనాల్ ఈఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోందని, నంద్యాల జిల్లాలో ఇసుక నిల్వలు, స్టాక్‌పాయింట్‌లు లేని కారణంగా కర్నూలు జిల్లాలోని సి.బెళగల్ మండలంలోని సుంకేసుల బ్యారేజీ, కడప జిల్లాలోని కొండాపురంలోని స్టాక్ పాయింట్‌ల నుంచి లోడింగ్, రవాణా చార్జీలతో వినియోగదారులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉచిత ఇసుక సరఫరా తదితర అంశాలకు సంబంధించి కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెం.08514242011 నెంబర్‌కు కాల్ చేసి సమాచారాన్ని స్వీకరించవచ్చన్నారు. జిల్లాలోని కొలిమిగుండ్ల, బేతంచెర్ల, డోన్ చెక్‌పోస్టులతోపాటు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చాగలమర్రి, బ్రాహ్మణకొట్కూర్‌లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, అక్రమ ఇసుక రవాణాపై 24గంటలపాటు నిరంతరాయంగా నిఘా ఉంచాలని ఆదేశించారు. నంద్యాల జిల్లా కేంద్రంలో కూడా స్టాక్ యార్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్ మాట్లాడుతూ చాగలమర్రి, బ్రాహ్మణకొట్కూరు, కొలిమిగుండ్లలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ ఇసుకరవాణాకు చర్యలు తీసుకుంటామన్నారు. జేసీ విష్ణుచరణ్ మాట్లాడుతూ ఇసుక రవాణాకు సంబంధించి అధిక సంఖ్యలో వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించాలని రవాణా అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్ధారించిన రేటుకు మించి రవాణా చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు

అహోబిలంలో ఎన్నికల జాయింట్ సెక్రటరీ

ఆళ్లగడ్డ/శిరివెళ్ల/ బనగానపల్లె: ఆగస్టు 24: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామికి రాష్ట్ర ఎన్నికల జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ శనివారం పూజలు చేశారు. ఈయన రాకను పురస్కరించుకొని ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈయన ఎగువ, దిగువ అహోబిలాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం సాయిప్రసాద్‌కు వేదపండితులు ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలు అందించారు. అలాగే యాగంటి క్షేత్రాన్ని సందర్శించి ఉమా మహేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో వెలసిన సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, మహదేవపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట రమణ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



యాగంటి క్షేత్రంలో రాష్ట్ర ఎన్నికల కమీషన్ జాయింట్ సెక్రెటరీ సాయిప్రసాద్

శ్రీశైలానికి భారీగా ఇన్‌ఫ్లో

శ్రీశైలం, ఆగస్టు 24: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి శనివారం వరద ప్రవాహం భారీగా నమోదయింది. జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 78,602 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 17,916 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 117 క్యూసెక్కులు మొత్తం 96,635 వరద ప్రవాహం వస్తుంది. శనివారం రాత్రి 9 గంటల సమయానికి 1,15,432 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతుంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 884.30 అడుగులకు చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 211.4759 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 31,361 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కులు మొత్తం 69,243 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

మహానందీశ్వరుని ఆక్రమిత స్థలం స్వాధీనం

నంద్యాల (కల్చరల్)/మహానంది, ఆగస్టు 24: మహానందీశ్వరుని ఆక్రమిత స్థలాన్ని అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల స్టేట్‌బ్యాంక్ కాలనీలో 3.78 ఎకరాల స్థలం ఉంది. అయితే ఈ స్థలాన్ని కొందరు కబ్జా చేసి విక్రయించారు. ఇందులో భవనాలు కూడా నిర్మించారు. ఈ వ్యవహారంపై దేవదాయ శాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. కబ్జాకు గురైన స్థలంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ట్రిబ్యునల్ కోర్టు కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకొమని మహానంది ఆలయ అధికారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో ఆలయ అధికారులు ఆక్రమణదారులకు న్యాయశాఖ ద్వారా వచ్చిన నోటీసులు పంపారు. ఈ మేరకు శనివారం మహానంది ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓలు, సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌తో అక్రమ కట్టడాలను కూల్చి వేయించారు.



పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, సిబ్బంది



ఎక్స్‌కవేటర్ సాయంతో అక్రమ కట్టడాలు కూల్చివేస్తున్న దృశ్యం

ముగిసిన సప్తరాత్రోత్సవాలు

- సర్వ సమర్పణతో ముగింపు పలికిన పీఠాధిపతి
- సప్త వాహన రథోత్సవంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు



సప్త వాహన రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 24 : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 353వ సప్తరాత్రోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పంచ వాహన రథానికి పూజలు చేసి ప్రారంభించారు. ఏడు రోజులు జరిగిన సప్తరాత్రోత్సవాలకు పీఠాధిపతి సర్వసమర్పణోత్సవంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. శనివారం ఉదయం నుంచి రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణ, మహామంగళహారతులు ఇచ్చారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను వస్త్రాలతో పొదిగిన హారాలతో అలంకరించి స్వర్ణ పల్లకిలో అధిష్టించారు. అనంతరం ఊంజల సేవ చేశారు. ఆ తరువాత గజ వాహనం, చెక్క, వెండి, బంగారు, నవరత్నాల రథాలపై ఊరేగించారు. చక్క రథంపై అశ్వ, గజ, స్వర్ణ పల్లకి, మయూరి సప్త వాహనాలను సుందరంగా తీర్చిదిద్ది వాటి మధ్య రాఘవేంద్రస్వామి నిల్వ ప్రతిమను అలంకరించి అందులో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతులు మహామంగళ హారతులు ఇచ్చి పంచవాహన రథోత్సవాన్ని ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని పంచ వాహన రథోత్సవాన్ని తిలకించి ఆనందపరవశులయ్యారు. పీఠాధిపతి పంచవాహన రథానికి సర్వసమర్పణోత్సవం చేసి మహామంగళహారతులు ఇచ్చి ముగింపు పలికారు. కార్యక్రమంలో బాలగర్ మఠం పీఠాధిపతి అక్షోభ్యరామ ప్రియ తీర్థులు , వ్యాసరాజ మఠం పీఠాధిపతి విద్యా మనోహర్ తీర్థులు, విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, మఠం దివాన్ సుజీంద్రాచార్, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, దక్షిణాది విచారణకర్త శ్రీమఠం సలహాదారు శ్రీనివాస్ కస్బే, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈలు బద్రినాథ్, శ్రీహరి, వ్యాసరాజాచార్, బిందు మాధవ్, ద్వారపాలక అనంతస్వామి, జయతీర్థాచార్, వాధిరాజాచార్‌లు పాల్గొన్నారు.



రాఘవేంద్ర స్వామి బృందావనం



కూచిపూడి నృత్యం చేస్తున్న కర్నూలు లాస్య ఇన్‌స్టిట్యూట్ కళాకారులు

అలరించిన కూచిపూడి నృత్యం

ఉత్సవాల ముగింపులో భాగంగా యోగీంద్ర కళా మండపంలో కర్నూలు చెందిన లాస్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ బృందం, హైదరాబాదుకు చెందిన శ్రీసాయి దేవా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ వారిచే కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హైదరాబాదుకు చెందిన వరవీణ మ్యూజిక్ అకాడమి వారిచే శాస్త్రీయ సంగీతం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. వీరి నృత్యాలను పీఠాధిపతి కనులారా తిలకించి నగదు, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



పల్లకీలో ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు



నయనం ప్రధానం..

- నేత్రదానంతో అంధులకు చూపు
- దాతల సంఖ్య పెరగాలి
- 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 24:

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం.. శరీరంలోని అన్ని అవయవాల కంటే కళ్లు ప్రధానమైనవని దీని అర్థం. మృతి చెందిన దాతల నుంచి కళ్లు సేకరించి చూపు లేని మరో ఇద్దరికి వెలుగులు నింపడమే కర్తవ్యంగా ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ నేత్రదానం అవగాహన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోని అంధుల సంఖ్యలో నాలుగో వంతు భారతదేశంలోనే ఉన్నారు. ప్రమాదాలు, పోషకాహార లోపం, అంటు వ్యాధులు, పుట్టుకతో వచ్చిన లోపాల కారణంగా అనేక మంది కంటి చూపు కోల్పోతున్నారు. వీరి కంటిలోని నల్లగుడ్డును మార్చగలిగితే చూపు వచ్చే అవకాశం ఉంటుంది. మరణించిన వారి కంటిలోని నల్లగుడ్డు సేకరించి అంధులకు అమర్చితే చూపు వస్తుంది. ఐ-కౌన్సిలర్లు కర్నూలు, నంద్యాల, ఆదోనితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మృత్యువు తప్పదనుకున్న రోగుల కుటుంబ సభ్యులను నేత్రదానంపై చైతన్యపరుస్తున్నారు. వారి అంగీకారం మేరకు కంటిలోని నల్లగుడ్డు సేకరించి భద్రపరిచి ఎల్‌వీ ప్రసాద్ ల్యాబ్‌కు తరలిస్తున్నారు.

దేశంలో ప్రస్తుతం 11 లక్షల మంది అంధులు ఉండగా.. వారి సంఖ్య ఏటా 1.25 లక్షలు పెరుగుతుండటం ఆందోళనకరంగా ఉంది. గతంలో 40ఏళ్లపైబడిన వారు కార్నియా (నల్లగుడ్డు) వ్యాధితో అంధులు అవుతుండగా.. ప్రస్తుతం చిన్న పిల్లలు సైతం ఆ సమస్యతో బాధపడుతున్నారు. వీరికి దాతల నేత్రాలు అమర్చాల్సి ఉంటుంది. అయితే అవసరానికి తగ్గట్టు నేత్రాదాతలు ముందుకు రావడం లేదు. 20 శాతం మంది మాత్రమే నేత్రదానానికి సిద్ధమవుతున్నారు. ఎంతోమంది అంధులు దాతల కోసం ఎదురు చూస్తున్నారు.

నేత్రదానం ఇలా చేయాలి

- కుటుంబ సభ్యుల సమ్మతితో మరణానంతరం నేత్రదానానికి అవకాశం ఉంటుంది.
- మరణించాక 6 నుంచి 8 గంటలలోపే కళ్లను సేకరించాలి.
- వయస్సు, లింగబేధం, రక్తం గ్రూపు, మతంతో సంబంధం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చు.
- శుక్ల వ్యాధి ఉన్న వారు, మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారు కూడా కళ్లను దానం చేయవచ్చు. ఎయిడ్స్, హైపటైటిస్, బీపీ, బ్లడ్ క్యాన్సర్, ధనుర్వాతం, మెదడువాపు అంటు వ్యాధులు ఉన్న వ్యక్తులు నేత్రదానం చేయరాదు.

జిల్లాలో ఐ బాల్స్ సేకరించిన కళ్లు

సంవత్సరం	సేకరించిన కళ్లు
2019-2020	377
2020-2021	176
2021-2022	264
2022-2023	412
2023-2024	488
2024 ఏప్రిల్ నుంచి ఆగస్టు 25 వరకు	163



నేత్రదానంపై విస్తృత ప్రచారం



జిల్లాలో నేత్రదానంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో జాతీయ నేత్రదానం పక్షోత్సవాల సందర్భంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, స్కూల్స్, కాలేజీలు, గ్రామాల్లో సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం. ముఖ్యంగా విద్యాసంస్థల్లో విద్యార్థులకు చైతన్యం తీసుకువచ్చేలా కృషి చేస్తున్నాం. ప్రజలు మూఢ నమ్మకాలను వీడి నేత్రదానానికి ముందుకు రావాలి.

- డా.ఎల్. భాస్కర్, డీఎంహెచ్‌వో, కర్నూలు

నేటి నుంచి నేత్రదాన పక్షోత్సవాలు



ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నాం. నల్లగుడ్డు తెల్లబడటం ద్వారా కంటి చూపును కోల్పోయిన వారికి దాతల నుంచి సేకరించిన నల్లగుడ్డును అమర్చుతారు. ఆడవారు, మగవారు ఏ వయస్సు ఉన్న వారైనా వ్యాధులతో చనిపోయినా నేత్రదానం చేయవచ్చు. కార్నియా వెనుక 3వేల సెల్స్ దాకా ఉంటాయి. ఇవి డ్రై కాకుండా చూసుకోవాలి. చనిపోయిన వెంటనే 6 గంటలలోపు 9849903116, 9640692299 నెంబర్లను ఫోన్ చేస్తే నేత్రాలను సేకరించడానికి ఒక బృందాన్ని పంపిస్తారు.

- డా.పి. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రి

నేత్ర దానానికి ముందుకు రావాలి



నేత్రదానానికి అందరూ ముందుకు రావాలి. దీనిపై అపోహలు విడనాడాలి. మరణించిన వారి నుంచి కంటిలోని నల్లగుడ్డు మాత్రమే సేకరిస్తారు. నేత్రదానానికి ముందుకువచ్చే వారు సమీపంలోని కౌన్సిలర్ గానీ, టెక్నీషియన్‌ను సంప్రదిస్తే వారు నేరుగా వచ్చి నేత్రాలను సేకరిస్తారు. కళ్లజోడు పెట్టుకునేవారు, మధుమేహం, బీపీ, ఉబ్బసం, వ్యాధులతో బాధపడేవారు కూడా నేత్రదానం చేయవచ్చు.

- పి. సుధాకర్‌రావు, సీనియర్ కంటి వైద్యనిపుణుడు, సుశీల నేత్రాలయ, కర్నూలు

ఆలూరులో ఓటమి బాధాకరం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 24: ఆలూరులో ఓటమి చెందడం బాధాకరమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమిలో ఎవరిని తప్పు పట్టడం లేదని, అందరూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేశారని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఎదురైన సమస్యలను గురించి చర్చించుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో వీరభద్రగౌడ్, జి. అశోక్ కుమార్, పరమారెడ్డి, సుధాకర్, వెంకటేశ్వర చౌదరి, మీనాక్షి నాయుడు, సీఎస్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ విస్తృత పర్యటన

కర్నూలు(అర్బన్), ఆగస్టు 24: ఎంపీ బస్తిపాటి నాగరాజు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. శనివారం గోనెగండ్లలోని గాజుల దిన్నె ప్రాజెక్టును, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఎమ్మిగనూరులోని నవోదయ విద్యాలయాన్ని, ఆదోనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల పనులు నాణ్యంగా జరగలేదని, కరకట్టలు బలహీనంగా కట్టారని అధికారుల మీద మండి పడ్డారు.

చాగలమర్రిలో కుండపోత వర్షం

పొంగి ప్రవహిస్తున్న రాజోలి ఆనకట్ట



రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

చాగలమర్రి, ఆగస్టు 24: చాగలమర్రి మండలంలో శనివారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. గ్రామాల్లో రహదారులు జలమయమయ్యాయి. నూరానీ మసీదు, గంగమ్మ వీధి, ఎస్సీ కాలనీతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు జలమయమయ్యాయి. 21 మి.మీ. వర్షపాతం నమోదైంది. రాజోలి ఆనకట్ట వద్ద కుందూ నది పొంగి ప్రవహించింది. 15 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహంతో ఆనకట్టపై కుందూ నది ప్రవహించింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పసుపు, మొక్కజొన్న, ఉల్లి, తదితర పంటలకు వర్షం జీవం పోసింది. కుందూ నది ఉధృతి పెరగడంతో పరిసర గ్రామాల ప్రజలు నదిని దాటరాదని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలకు సూచించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి



ప్రదక్షిణలు చేస్తున్న కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ నటరాజన్

మంత్రాలయం, ఆగస్టు 24: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హై కోర్టు జడ్జి జస్టిస్ నటరాజన్ శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట సూపర్నిండెంట్ అనంతపురాణిక్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్ పాల్గొన్నారు.

లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 24: విద్యార్థులకు అకడమిక్ బ్యాంక్ క్రెడిట్స్ ఏబీసీ ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్స్ ఏజెన్సీ గడువులోపు పూర్తి చేయాలని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశించారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలో అను బంధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు, ప్రొఫెషనల్స్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ నేషన్ వన్ ఐడీ అన్న ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవడానికి యూనివర్సిటీకి సహకరించాలని కోరారు. రిజిస్ట్రార్, పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం 2020 ప్రకారం ప్రతి ఒక్కరికీ ఏబీసీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయాల్సిందిగా సూచించారు. 2021 కళాశాలల్లో చేరిన విద్యార్థులకు ఈ రిజిస్ట్రేషన్ తప్పని సరి అన్నారు. డీన్‌లు భరత్, విశ్వనాథరెడ్డి, ఆచార్య భరత్ పాల్గొన్నారు.

హోస్పేట్ డ్యామ్ ఘటనతోనైనా మేలుకోవాలి: ఎంపీ

గోనెగండ్ల, ఆగస్టు 24: హోస్పేట్ డ్యామ్ ఘటనతోనైనా ఇక్కడి ఇరిగేషన్ అధికారులు మేలుకోవాల్సిన అవసరం ఉందని కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం గాజులదిన్నె ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం.. ప్రస్తుతం ఎంత నీరు ఉంది.. వచ్చే రబీలో సాగు భూములకు నీరు ఇవ్వగలరా లేదా అని ఇరిగేషన్ ఈఈ శైలేష్, డీఈ విజయ్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్వహణ పట్ల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కర్నూలు పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వేదవతి, ఆర్‌డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులు పూర్తి కావాలని అన్నారు. కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాజులదిన్నె హనుమంతు, నాగన్న, జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.



గాజులదిన్నె ప్రాజెక్టు అధికారులతో మట్లాడుతున్న ఎంపీ నాగరాజు

26న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 24: కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 26న రద్దు చేశామని కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 26వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో రద్దు చేశామని, ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు. సెప్టెంబరు 2వ తేదీన నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం ఆచూకీ లభ్యం

ఓర్వకల్లు, ఆగస్టు 24: ఓర్వకల్లు జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ లభించినట్లు ఎస్ఐ సునీల్ కుమార్ శనివారం తెలిపారు. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి చెందిన వడ్డెనూరు సుధాకర్ నాయుడు (50) అని తెలిపారు. ఈ నెల 20న ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామంలో తన చెల్లెలితో రాఖీ కట్టించుకుని హుసేనాపురం గ్రామానికి వస్తుండగా.. ఓర్వకల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వాహనం ఢీకొట్టి రక్తగాయాలతో పడి వున్న అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 23న మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుని భార్య ఎల్లావతి గుర్తించి తన భర్తేనని నిర్ధారించుకుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోవిందపల్లెలో వ్యక్తి మృతి

శిరివెళ్ల, ఆగస్టు 24: మండలంలోని గోవిందపల్లె గ్రామ శివారులో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన నక్క ప్రవీణ్(45) అనే వ్యక్తి వారం రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా దాదాపు ఐదు రోజుల కిందట గ్రామ శివార్లలోని చెట్టు కింద మృతి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు ప్రవీణ్ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నేడు కాశీభట్ల వేణుగోపాల్ సంతాప సభ

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 24: ఇటీవల మృతి చెందిన కర్నూలుకు చెందిన ప్రముఖ కవి, రచయిత కాశీభట్ల వేణుగోపాల్ సంతాప సభ ఆదివారం ఉదయం 10 గంటలకు, నగరంలో మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో నిర్వహిస్తున్నట్లు ఆయన మిత్రులు తెలిపారు. కర్నూలు సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంతాప సభకు సభాధ్యక్షుడిగా ప్రముఖ కవి జి. వెంకటకృష్ణ వ్యవహరిస్తారని, వక్తలుగా అనంతు చింతలపల్లి, పి. చంద్రశేఖర్, ఎం. దయానంద్ హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

ఆదోని, ఆగస్టు 24: ఆదోని త్రీ టౌన్ పోలీసస్టేషన్ పరిధిలో భారీ ఎత్తున పేలుడు పదార్థాలు శనివారం పట్టుబడ్డాయి. ఆదోని నేషనల్ హైవేలో సంచిలో నిలువ ఉన్న జిలిటన్ స్టిక్స్ డిటోనేటర్స్ కేబుల్ బెండల్స్‌తో పాటు ఇతర పేలుడు పదార్థాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఓ వ్యక్తి అందించిన సమాచారంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే తహసీల్దార్ శివరాముడు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. త్రీటౌన్ సీఐ రామలింగప్ప పేలుడు పదార్థాలు ఉన్న సంచిను స్వాధీనం చేసుకున్నారు.

కల్లూరు వీఆర్వో మద్దిలేటి బదిలీ

కల్లూరు, ఆగస్టు 24: కల్లూరు వీఆర్వో మద్దిలేటి డిప్యుటేషన్‌పై దేవనకొండ మండలం తెర్నేకల్‌కు బదిలీ అయినట్లు తహసీల్దారు కె.ఆంజనేయులు శనివారం తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా నుంచి ఉత్తర్వులు జారీ అయ్యా యని వెల్లడించారు. కల్లూరు వీఆర్వో మద్దిలేటి రికార్డులు హ్యాండోవర్ చేయాల్సి ఉందని, అందువల్ల రిలీవ్ చేయలేదని తహసీల్దారు స్పష్టం చేశారు. రికార్డులు హ్యాండోవర్ చేయగానే మద్దిలేటిని రిలీవ్ చేయనున్నట్లు తెలిపారు. అయితే సదరు వీఆర్వోపై పలు అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కలెక్టర్ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా డిప్యుటేషన్‌పై బదిలీ వేటు వేసినట్లు సమాచారం.

నీట్ పీజీలో వెలుగోడు యువకుల సత్తా



నాగశశి ప్రణయ్‌రెడ్డి



రాజకుమార్

వెలుగోడు, ఆగస్టు 24: నీట్ పీజీలో వెలుగోడుకు చెందిన ఇద్దరు యువకులు సత్తా చాటారు. వెలుగోడు పట్టణానికి చెందిన డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్ పద్మ దంపతుల కుమారుడు నాగ శశి ప్రణయ్‌రెడ్డి నీట్ పీజీలో 1272 ఆల్ ఇండియా ర్యాంకు సాధించాడు. అలాగే శ్రీనివాసులు కుమారుడు రాజకుమార్ నీట్ పీజీలో 8200 ఆల్‌ఇండియా ర్యాంకుతో ప్రతిభ చాటాడు. ఇరువురిని పలువుర అభినందించారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి



ఇసుక రీచులను పరిశీలీస్తున్న జేసీ

సి. బెళగల్, ఆగస్టు 24: అధికారులు బాధ్యతతో పనిచేయాలని జేసీ నవ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో ఆమె మాటాడారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సచివాలయాలకు వచ్చిన ప్రజలకు వెంటనే సమాధానం చెప్పాలన్నారు. అనంతరం మండంలోలని ఈర్లదిన్నె, శింగవరం ఇసుక రీచులను పరిశీలించారు. ఉచిత ఇసుకపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇసుక కావాలసిన వారు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకొవచ్చు అన్నారు. జేసీ వెంట ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ విజయశ్రీ, మైనింగ్ అధికారులు, ఎస్ఐ తిమ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

కుల ధ్రువీకరణపై జేసీ విచారణ

పెద్దకడుబూరు, ఆగస్టు24: పెద్దకడుబూరు మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో కులధృవీకరణ పత్రంపై జేసీ నవ్య శనివారం విచారణ చేపట్టారు. గ్రామంలో సుమోటోగా నమోదు చేసుకున్న కుల ధృవీకరణపై గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులకు జేసీ నవ్య ప్రతి ఇంటికి తిరిగి కుల ధృవీకరణ చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రజలు జేసీని కలిసి తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఆమె వెంట్ సబ్‌కలెక్టర్ విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీనాథ్, డీటీ మహేష్, ఆర్ఐ మహేష్, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు

పత్తి గరిష్ఠ ధర రూ.7,789

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 24 : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు శనివారం క్వింటం గరిష్ఠంగా రూ.7789 పలికింది. గత పది రోజులుగా పత్తి ధరలు స్థిరంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ పంట ఉత్పత్తులు ఇంకో నెల రోజుల్లో చేతికి వచ్చే అవకాశం ఉంది. పత్తి ధరలు గత సీజన్ నుంచి పెరగకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ ఏడాదైనా పత్తి ధరలు పెరిగితే పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీరుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 222 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర క్వింటం రూ.4211, గరిష్ఠ ధర రూ.7789 మధ్యస్థ ధర రూ.7535 పలికింది.

ఎంఈవో నాగేశప్ప సస్పెన్షన్

కోసిగి, ఆగస్టు 24: కోసిగి మండల కేంద్రంలో ఎంఈవో-2గా విధులు నిర్వహిస్తున్న నాగేశప్పను డీఈవో శామ్యూల్ సస్పెండ్ చేశారు. ఎంఈవో-2 నాగేశప్ప విధి నిర్వహణలో అలసత్వం వహించడమే కాకుండా విద్యార్థుల యూనిఫాం అందించడంలో నిర్లక్ష్యం వహించి యూనిఫాంల రవాణా చార్జీలను అందించలేదనే ఉపాధ్యాయుల ఫిర్యాదుతో డీఈవో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. అయితే మరికొందరు ఉపాధ్యాయులు ఎంఈవో-2ను సస్పెండ్ చేయడం సరి కాదని నిజనిర్ధారణ చేసుకుని ఎంఈవో2 నాగేశప్ప సస్పెండ్‌ను ఎత్తివేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతి పత్రం అందించడం గమనార్హం.

మహిళ అరెస్టు

ఆదోని రూరల్ ఆగస్టు 24 : ఆదోని పట్టణంలోని భవాజీ పేటకు చెందిన బోయ ఈరమ్మను ఇస్బీ పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక బస్సులో మద్యాన్ని తరలిస్తుండగా శనివారం దాడి చేసి ఆమె నుంచి రెండు బాక్సుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు



ఏఎస్పీని సన్మానిస్తున్న ఎస్పీ తదితరులు

నంద్యాల క్రైం, ఆగస్టు 24: నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రవీణ్‌కుమార్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం ఆయనకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్ నంద్యాల జిల్లాలో సుమారు 7నెలల పాటు పోలీస్ శాఖలో సేవలందించారు. బదిలీపై ఆయన విశాఖపట్నం అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ విభాగానికి బదిలీ అయ్యారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌నందు పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎస్పీ మాట్లాడుతూ ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్ చాలా పట్టుదలతో అప్పగించిన పనిని శ్రద్ధగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సేవలందిస్తారని కొనియాడారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తన సర్వీస్ అంతటిలో మొదటిసారిగా రాయలసీమలో విధులు నిర్వహించానని, తనకు అప్పగించిన పనిని నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా తన శాయశక్తులా నెరవేర్చానని పేర్కొన్నారు. డీఎస్పీలు రామాంజి నాయక్, యుగంధర్‌బాబు, రవికుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్‌రెడ్డి, ఇస్మాయిల్, కంబగిరి రాముడు, సుబ్రమణ్యం, సుధాకర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నేత్రదాన వారోత్సవాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 24: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సిబ్బందితో కలిసి శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. వారోత్సవాలలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పని చేసే సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జాతీయ అంధత్వ నివారణ, దృష్టి లోప నివారణ అంశాలపై ప్రజల్లోకి వెళ్లి విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ మాధవీలత, కార్యాలయ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేలైన పద్ధతులతో అధిక దిగుబడి: డీఏవో



వరి నారును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

నంద్యాల రూరల్, ఆగస్టు 24: మేలైన సాగు విధానంతోనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. శనివారం నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో నంద్యాల మండలం బిల్లలాపురం రైతు సేవా కేంద్రంలో, వరిమడిలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఏవో మురళీకృష్ణ వరినారుమడులను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులకు అవగాహన కల్పించేలా పలు విషయాలు విపులీకరించారు. సూడోమోనాస్ ద్రావణంలో నారులు ముంచి నాటు వేయడం ద్వారా అగ్గితెగులును నివారించవచ్చన్నారు. పొలంబడికి ఎంపికైన ప్రతిరైతు అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కాండంతొలుచు పురుగు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఏవో అధికారి ప్రసాదరావు, వీఏఏలు అనిల్‌కుమార్, శివనాయక్, చక్రిధర్, రైతులు పాల్గొన్నారు.

మహానంది: పొలంబడిద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని నంద్యాల డీఆర్‌సీ ఏడీఏ సరళమ్మ తెలిపారు. శనివారం మహానంది మండలంలోని నందిపల్లె గ్రామంలో మేలేన సాగు యాజమాన్య పద్ధతులపై పొలంబడి కార్యక్రమాన్ని మండల ఏఓ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పొలంబడి ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందే విషయాలు తెలుసుకోవచ్చునన్నారు. ఏఈవో శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారులు లక్ష్మీకాంత్, మధు, కృష్ణకాంత్, పల్లవి, షైనీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: రైతులు వ్యవసాయాధికారులు ఇచ్చే సలహాలు సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని సంజీవ్‌నగర్ తాండా గ్రామంలో సాగు చేసిన వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు వరి పంటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఈవో లతమ్మ, వ్యవసాయ సిబ్బంది మధు, రైతులు పాల్గొన్నారు.

'అవకతవకలపై విచారణ జరపాలి'



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వెలుగోడు, ఆగస్టు 24: వెలుగోడు మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, వీటిపై విచారణ జరపాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏపీవో మల్లికార్జున, ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సుబ్బయ్యకు శనివారం వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్‌ఆచారి, రాజశేఖరరెడ్డి, నాగేశ్వరరావు, పురుషోత్తం పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు

కొత్తపల్లి, ఆగస్టు 24: మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద కేంద్ర ప్రభుత్వం రూ.44,67,155లు మంజూరు చేసినట్లు ఎంపీడీవో దాసరి మేరీ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా దుద్యాల గ్రామ పంచాయతీకి రూ.5,57,910, ఎదురుపాడుకు రూ.2,52,130, ఎర్రమటానికి రూ.4,82,643, జి.వీరాపురం రూ.1,51,660, గోకవరానికి రూ.3,73,363 మంజూరైనట్లు తెలిపారు. అలాగే గువ్వలకుంట్లకు రూ.4,16,809, కొక్కెరంచ రూ.3,10,996, కొత్తపల్లి రూ.5,28,991, ముసలిమడుగు రూ.2,95,046 మంజూరైనట్లు చెప్పారు. నందికుంట రూ.2,26,831లు, గుమ్మడాపురం రూ.3,34,828, శివపురం రూ.5,35,942 మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరుచేసినట్లు చెప్పారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే శిశువు మృతి

● ఆసుపత్రి ఎదుట తల్లి, కుటుంబ సభ్యుల నిరసన



ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

పాములపాడు, ఆగస్టు 24: వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మగశిశువు చనిపోయాడని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పాములపాడు గ్రామానికి చెందిన బాలింత సునీత, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. తమ బిడ్డ మరణానికి కారకులైన నర్సు, సిబ్బందిపైన చర్యలు తీసుకోవాలని సునీత, కుటుంబ సభ్యులు, బంధువులు, మాలమహానాడు నాయకులతో కలిసి శనివారం ఆసుపత్రి వద్ద ధర్నా చేపట్టారు. బాధితులు మాట్లాడుతూ గురువారం రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో కాన్పు కోసం రాగా స్టాఫ్ నర్సుతోపాటు ఇద్దరు సిబ్బంది అడ్మిట్ చేసుకున్నారని తెలిపారు. రాత్రి 12 గంటల సమయంలో నొప్పులు అధికం కావడంతో భరించలేక ఆత్మకూరు ప్రైవేటు వైద్యశాలకు వెళ్తామని చెప్పామని, అయితే తామే కాన్పు చేస్తామని సిబ్బంది చెప్పారని తెలిపారు. అనంతరం ప్రసవం చేసి శిశువు చనిపోయాడని చెప్పారన్నారు. డెలివరీ సమయంలో తనను కొట్టి చిత్ర హింసలు పెట్టారని సునీత ఆరోపించారు. వైద్యురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ కాన్పు చేయడానికి నర్సు, సిబ్బంది శక్తి వంచన లేకుండా ప్రయత్నించారని అన్నారు. అయితే పురిటి శిశువు చనిపోవడం బాధాకరమని అన్నారు. కాన్పుల వార్డును ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్ సందర్శించారు. బాధితులు, వైద్యుడు, నర్సును విచారించారు. నివేదికను ఉన్నతాధికారులు పంపిస్తామని ఆయన తెలిపారు. ఆయనతో ఎఫ్‌డీటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్, డాక్టర్ భరత్ ఉన్నారు.

కోర్టు భవనాలను పునర్నిర్మించాలి

● ఎమ్మెల్యే బుడ్డాకు న్యాయవాదుల విన్నపం



శిథిలమైన కోర్టు భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, ఆగస్టు 24: ఆత్మకూరు పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న కోర్టు భవనాలను పునర్నిర్మించాలని బార్ అసోషియేషన్ ప్రతినిధులు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి విన్నవించారు. శిథిలావస్థకు చేరుకున్న కోర్టు భవనాలను, న్యాయమూర్తుల నివాస గృహాలను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాదులు ఇక్కడి సమస్యలను వివరించారు. ఇందులో ప్రధానంగా 1992లో నిర్మించిన కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతూ ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. అలాగే జడ్జిల నివాస గృహాలు కూడా అధ్వానంగా ఉండి నిరుపయోగంగా మారాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఈ నిర్మాణాలను పూర్తిస్థాయిలో ధ్వంసం చేసి నూతన భవన నిర్మాణాలను చేపట్టాలని న్యాయవాదులు ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా అర్హులైన న్యాయవాదులకు ఇళ్లస్థలాలు, పక్కాగృహాలతో ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ప్రస్తుతం ఆత్మకూరు జూనియర్, సీనియర్ కోర్టుల పరిధిలో వేల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పరిస్థితుల్లో అదనపు సబ్ కోర్టును కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ.. ప్రస్తుత సమస్యను పరిష్కరించేందుకు తాను అన్నివిధాలుగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన న్యాయవాదులందరికీ ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు, ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని అన్నారు. అంతకుముందు న్యాయవాదులు ఎమ్మెల్యే బుడ్డాను ఘనంగా సత్కరించారు. బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు, సీనియర్ అడ్వకేట్ కంచర్ల గోవిందరెడ్డి, న్యాయవాదులు గిరిరాజు, కే.కేశవరెడ్డి, సుధాకరరెడ్డి, గొడుగు రవికుమార్, నగేష్, సుదర్శన్, నూర్‌అహ్మద్, మాణిక్యం ఉన్నారు.

టీడీపీలో చేరిక



ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 24: నియోజకవర్గంలోని మిడ్తూరు మండలం పీరుసాహెబ్ పేట ఉప సర్పంచ్, వైసీపీ నాయకుడు టీడీపీలో చేరారు. శనివారం నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ పరిపాలనను చూసి పార్టీలో చేరుతున్నామన్నారు. అనంతరం నాయకులను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: సార్వత్రిక ఎన్నికలకు ముందు వరకు టీడీపీ పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ ప్రశంసా పత్రాలను అందించారు. దీంతో శనివారం అల్లూరు గ్రామంలో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య చేతుల మీదుగా ఆ ప్రశంసా పత్రాలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు మురళీకృష్ణ, రాజశేఖర్, ఇంతియాజ్, బేగ్, శివ, అఫ్సర్ బాషా అందుకున్నారు.

పాములపాడు: మన టీడీపీ యాప్‌లో చురుగ్గా పాల్గొంటూ ఎప్పటికప్పుడు కొత్త మెజేజ్‌లను అందించిన టీడీపీ నాయకుడు ఆదిరెడ్డికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ప్రశంసా పత్రం అందించారు. నాయకులు తిమ్మారెడ్డి, మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్, గోవింద్, కృష్ణ, సురేశ్, తదితరులు పాల్గొని అభినందించారు.

'టాయిలెట్ ఫొటోలను అప్‌లోడ్ చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఎంఈవో

పాణ్యం, ఆగస్టు 24: ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శులు సోమ, గురువారాల్లో, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, సభ్యులు బుధ, శుక్రవారాల్లో ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. పాఠశాలల్లోని టాయిలెట్‌లను ఫొటోలు తీసి యాప్‌లో ఎవరు, ఎప్పుడు అప్‌లోడ్ చేయాలన్న అంశంపై శనివారం ఎంఈవో ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ రోజూ సాయంత్రం హెచ్‌ఎంలు సర్వే ఫాంలో టాయిలెట్‌ల వివరాలు పంపాలన్నారు. అలాగే విద్యాశాఖ పథకాల పేర్లు మారినట్లు తెలిపారు. దూరవిద్యలో పది, ఇంటర్ అడ్మిషన్ల కోసం ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వంద రూపాయల ఫైన్‌తో సెప్టెంబరు 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9494722511 నెంబరులో సంప్రదించాలన్నారు.

'పకడ్బందీగా పారిశుధ్య నిర్వహణ'

ఆత్మకూరు, ఆగస్టు 24: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడానికి ప్రభుత్వ నూతన విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎంపీడీవో మోహన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ ఎంఈవో-2 సురేష్ తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్య కమిటీ చైర్మన్లు, సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు నూతన విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి వారంలో ప్రతి సోమ, గురువారాల్లో ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, బుధ, శుక్రవారాల్లో పేరెంట్స్ కమిటీ సభ్యులు పర్యవేక్షణ చేసి ఫొటోలు క్యాప్చరింగ్ చేయాల్సి ఉంటుందని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక

గడివేముల, ఆగస్టు 24: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదోతరగతి చదివిన కేవీ వర్షిత ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి శ్రీకాకుళం ట్రిబుల్‌ఐటీ కళాశాలలో సీటు సాధించారని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కేవీ వర్షితను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఎల్‌కేఆర్ గ్లోబల్ స్కూల్‌లో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 24: నంద్యాల పట్టణంలోని ఎల్‌కేఆర్ గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ముఖ్య అతిథిగా డైరెక్టర్ డాక్టర్ జె.మురళీనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ప్రిన్సిపాల్ కోటి నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలాదేవి, ఏవో రమణ తదితరుల ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలను నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలు, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉట్టికట్టే సన్నివేశాలు, బాలబాలికలచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీకృష్ణ తత్వాన్ని, శ్రీకృష్ణాష్టమి పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు.

'అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోండి'



మాట్లాడుతున్న గడివేముల తహసీల్దార్

గడివేముల, ఆగస్టు 24: చదువు మధ్యలో ఆపి వేసిన పదోతరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు సార్వత్రిక విద్యాపీఠం విధానంలో అడ్మిషన్ పొంది మళ్లీ చదువుకునే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బీవీఎస్ విద్యాసాగర్ సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్, విద్యా సంక్షేమ సహాయకులతో శనివారం ఎంఈవో, తహసీల్దార్ సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ పదోతరగతి, ఇంటర్‌ఫెయిల్, చదువు మానివేసిన, రెగ్యులర్‌గా పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌ను సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. ఓపన్ స్కూల్ ద్వార పరీక్షలు రాసి పాసై రెగ్యులర్ వారి మాదిరిగానే సర్టిఫికెట్లు పొందవచ్చని అన్నారు. అనంతరం సార్వత్రిక విద్యాపీఠంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు విమల వసుంధరాదేవి, మేరి సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ అడ్మిషన్లను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, ఎంఈవో-1 బాలాజీనాయక్, ఎంఈవో-2 సురేష్ సూచించారు. శనివారం ఓపెన్ స్కూల్ విద్యకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ ఆవిష్కరించారు. అదేవిధంగా ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పించేలా విద్యాశాఖ అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గౌడ్‌సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన ఓపెన్ స్కూల్ గురించి అవగాహన కల్పించారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

నందికొట్కూరు, ఆగస్టు 24: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం రౌడీ షీటర్లనుహెచ్చరించారు. శనివారం నందికొట్కూరు సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో పగిడ్యాల, మిడ్తూరు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, బ్రాహ్మణకొట్కూరు స్టేషన్‌ల పరిధిలోని రౌడీ షీటర్లతో నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల దైనందిన జీవితంలోనూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించినా, ఎక్కడా ఎలాంటి హింసాత్మక ఘటనలు జరిగినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మిడ్తూరు ఎస్‌ఐ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

'మద్యానికి బానిస కావొద్దు'

కొత్తపల్లి, ఆగస్టు 24: చెంచులు మద్యానికి బానిసలు కావద్దని కొత్తపల్లి ఏఎస్‌ఐ బాబా ఫక్రుద్దీన్ సూచించారు. శనివారం రాత్రి కొత్తపల్లి చెంచుగూడెంలో ఏఎస్‌ఐ సిబ్బందితో కలిసి చెంచుల జీవన స్థితిగతపై అవగాహన కల్పించారు. ముందుగా గూడేల్లోని చెంచులతోపాటు వారి పిల్లలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఏఎస్‌ఐ మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేషారామ్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రవచనాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, ఆగస్టు 24: శ్రీశైలం మహాక్షేత్రంలో ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం ప్రఖ్యాత ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మచే ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో "గణపతి గాథలు" అనే అంశంపై తొమ్మిది రోజుల పాటు ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి జ్యోతి ప్రజ్వలన చేసి సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాన్ని ప్రారంభించారు. ప్రవాచకులు మాట్లాడుతూ శ్రీశైలక్షేత్రం సాక్షాత్తు ఇలలో వెలసిన కైలాసమని, ఇక్కడ సాక్షిగణపతి, రత్నగర్భగణపతి దర్శనమివ్వడం అదృష్టమని అన్నారు. గణపతిస్వామి ఆది నుంచి ఉన్నాడు కనుక అయన్ని ఆదిపూజ్యుడుగా ఆరాధిస్తున్నామని అన్నారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి 8.30 గంటల వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పెద్దిరాజు పాల్గొన్నారు.

'భారతీయ సంస్కృతి మహోన్నతం'

పాణ్యం, ఆగస్టు 24: భారతీయ సంస్కృతి మహోన్నతమైనదని వివేకనంద సేవా సమితి నిర్వాహకులు నాగార్జునరెడ్డి, రాఘవ విశ్వనాథ్, సుబ్బారావు అన్నారు. భారత సాంస్కృతిక వైభవం అంశంపై శనివారం శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారతీయ నాగరికత, సంస్కృతిని నేడు ప్రపంచ వ్యాప్తంగా అనుకరిస్తున్నారన్నారు. భారతదేశం ధర్మభూమి, కర్మభూమి, పుణ్యభూమి అని అన్నారు. భారతీయ ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. దేశ చరిత్రను తెలుసుకొని దేశ సంరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఐడియా ఫోర్జ్ సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంట్రా ఇనిస్టిట్యూషనల్ స్టార్టప్ కాంపిటీషన్ నిర్వహించారు. ఎస్కార్ట్ టెక్ హబ్ కంపెనీ ఆధ్వర్యంలో 'ఎస్కార్ట్ టెక్ హబ్' సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరించారు. కార్యకమంలో షర్మిలాదేవి పాల్గొన్నారు.

కొలనుభారతిలో భక్తుల సందడి



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

కొత్తపల్లి, ఆగస్టు 24: కొలనుభారతిలో శ్రావణమాస భక్త జన సందడి నెలకొంది. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తులు సరస్వతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన వస్త్రాలంకరణ, కుంకుమార్చన, పుష్పార్చన, సహస్ర నామార్చన, సప్తశివాలయాల్లో శివునికి అభిషేకాది క్రతువులు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 30 మంది చిన్నారులకు వారి తల్లిదండ్రులు అక్షరాభ్యాస క్రతువులు చేయించుకున్నారు. శ్రావణమాసం కావడం అందులో శనివారం విశేషమైన రోజు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో క్షేత్ర ప్రాంగణం భక్తజనంతో కళకలలాడింది. విచ్చేసిన భక్తులకు ఆర్యవైశ్య సత్ర నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

'సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 24: డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్ల జీవితాలతో చెలగాట మాడే భారత న్యాయ సంహిత చట్టం (1),(2)లను రద్దు చేయాలన్నారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 28, 29 తేదీలలో నంద్యాల జిల్లాలో జరిగే ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల రాష్ట్ర తరగతులను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మణ్, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, శివరాం, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి'

ఆత్మకూరు, ఆగస్టు 24: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విభాగంలో క్రాప్ ప్రొటెషన్ మేనేజ్‌మెంట్ కోర్సులో అతిథి అధ్యాపకుడిగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్హత కలిగిన వారు తమ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 27వ తేది ఉదయం 11గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

చోరీకి విఫల యత్నం

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 24: నంద్యాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి దొంగలు ఐదు ఇళ్లలో చోరీకి విఫల యత్నం చేశారు. ఎన్జీవోస్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనిలో ఓ ఇంట్లో హుసేనప్ప నిద్రిస్తుండగా ఇంటికి వేసిన తలుపులను తీసుకుని చోరీ చేసేందుకు లోపలికి వెళ్లారు. లోపల హుసేన్ నిద్రిస్తుండటంతో దొంగలు వెనుదిరిగి పోయారు. అదే కాలనీలో మరో నాలుగు ఇళ్లల్లో చోరీకి విఫలయత్నం చేయడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. దొంగలు అక్కడి నుంచి పరారయ్యారని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లి పరిశీలించారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు మూడోసారి వాయిదా

పగిడ్యాల, ఆగస్టు 24: కోరం లేక పగిడ్యాల జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌ఎంసీ ఎన్నికలు మూడోసారి కూడా వాయిదా పడ్డాయి. పాఠశాలలో కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఉదయం నుంచి 5, 6,7,8,9,10 తరగతులకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రుల కోసం ఉపాధ్యాయులు నిరీక్షించినప్పటికీ పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. దీంతో ఎంఈవో సుబాన్ ఎన్నికలను నిర్వహించలేమని చెప్పడంతో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రమణారావు ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. రెండుసార్లు నిర్వహించిన ఎన్నికల్లో ఓ ప్రజాప్రతినిధి వర్గీయుల మధ్య చైర్మన్ పదవి కోసం పోటీ నెలకొనడంతో వాయిదా వేశారు. తిరిగి ఉదయం నిర్వహించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంకాగా కోరం లేక మరోసారి వాయిదా పడ్డాయి. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహానందిలో ఏపీ ఎలక్షన్ కమిషన్ జాయింట్ సెక్రటరీ పూజలు

మహానంది, ఆగస్టు 24: మహానంది క్షేత్రంలో శనివారం ఏపీ ఎలక్షన్ కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాలలో కుటుంబ సమేతంగా అభిషేకార్చనలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు వీరికి శాలువాకప్పి సన్మానించారు. వీరివెంట వీఆర్వో శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగసంజీవరావు పాల్గొన్నారు.

28 నుంచి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 24: స్థానిక నాయిబ్రాహ్మణ కాలనీలో నిర్మించిన త్యాగరాజస్వామి ఆలయ ప్రతిష్ఠ ఈనెల 28నుంచి నిర్వహించనున్నట్లు నాయిబ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు వెల్లడించారు. 28 బుధవారం యాగశాల ప్రవేశం, గోపూజ, గణపతి పూజతో ప్రారంభమయ్యే ప్రతిష్ఠోత్సవాలు 30న ముగుస్తాయని వెల్లడించారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన కమిషనర్


ఎమ్మెల్యేతో కమిషనర్ వెంకటరామిరెడ్డి

ఆళ్లగడ్డ, ఆగస్టు 24: ఆళ్లగడ్డ మున్సిపాల్టి నూతన కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే అఖిలప్రియను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

కమిషనర్ సేవలు మరువరానివి

బదిలీపై వెళ్తున్న ఆళ్లగడ్డ కమిషనర్ రమేష్‌బాబు సేవలు మరువరానివని క్రీడాకారులు అన్నారు. శనివారం వైపీపీఎం కళాశాల ఇండోర్ స్టేడియంలో ఆయనను సన్మానించారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్నబీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 24: పట్టణంలోని డాల్ఫిన్స్ పాఠశాలలో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి 160 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. తన తండ్రి బీసీ గుర్రెడ్డి జ్ఞాపకార్థం సేవాకార్యక్రమాలు చేస్తుంటామన్నారు. పాఠశాల సిబ్బంది రాజారెడ్డిని సన్మానించారు.

అభివృద్ధికి సహకరించండి

ఆళ్లగడ్డ, ఆగస్టు 24: మండలం అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ రాఘవేంద్రా రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మహబూబ్ ఖాన్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంఈవో శోభావివేకవతి, ఏవో కిశోర్‌కుమార్ రెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

షరీఫ్ మృతి పార్టీకి తీరని లోటు : ఎమ్మెల్యే


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, ఆగస్టు 24: మున్సిపాల్టీ 20వ వార్డు టీడీపీ కౌన్సిలర్ హుసేన్ బాషా తండ్రి షరీఫ్(67) మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. శనివారం ఆమె షరీఫ్ మృతదేహానికి నివాళి అర్పించారు. భూమా కుటుంబం అండగా ఉంటుందని అన్నారు.

సంక్షేమ హాస్టళ్ల తనిఖీ

ఉయ్యాలవాడ, ఆగస్టు 24: మండలంలోని సంక్షేమ హాస్టళ్లను అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఎంపీడీవో ఉమమహేశ్వరరావు, ఆదర్శ బాలికల హాస్టల్‌ను తహసీల్దారు శ్రీనివాసులు తనిఖీ చేశారు. సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

రుద్రవరం, ఆగస్టు 24 : రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థిని జస్విత ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు శనివారం తెలిపారు. ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

రంగస్వామి గ్రామోత్సవం


రంగస్వామిని ఊరేగిస్తున్న రైతులు

ప్యాపిలి, ఆగస్టు 24: పట్టణంలో శనివారం రంగస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఏటా వర్షా కాలంలో రంగస్వామి పూజలు చేసి గుర్రంపై ఊరేగిం చడం ఆనవాయితీగా ఉంది.

మజ్జిగతో టమోటాలో మచ్చల నివారణ

ప్యాపిలి, ఆగస్టు 24: టమోటా పైరుపై పల్లటి మజ్జిగను పిచికారీ చేస్తే మచ్చలు నివారించవచ్చని ఏవో రాజేష్ అన్నారు. శనివారం వెంగళాం పల్లిలో టమోట పైరును పరిశీలించారు. సిబ్బంది రామాంజినేయులు, చెన్నప్ప, వసంత తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు


డీఎస్పీతో టీడీపీ నాయకులు

దొర్నిపాడు, ఆగస్టు 24: ఆళ్లగడ్డ నూతన డీఎస్పీ రవికుమార్‌ను శనివారం టీడీపీ నాయకులు కలిశారు. రైతు సంఘం అధ్యక్షుడు సిద్ధి సత్యనారాయణ, కొండాపురం సొసైటీ మాజీ అధ్యక్షుడు బబ్బూరి వెంకటస్వామి, లింగుట్ల వెంకట్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాళ్లూరి నాయుడు, చేకూరి నారాయణస్వామి, ఎండూరి గోపాల్‌చౌదరి, ఎండూరి రామసుబ్బయ్య, నాగేంద్ర, గుర్రప్పయాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

బైక్ బోల్తా.. ఇరువురికి గాయాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 24: మండలంలోని ఇటిక్యాల సమీపంలో బైక్ బోల్తా పడి శనివారం ఇరువురికి గాయాలయ్యాయి. ఇటిక్యాలకు చెందిన నరసింహయ్య, బాలరాజు పని నిమిత్తం కొలిమిగుండ్లకు వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు గమనించి 108వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

సారా విక్రేతల అరెస్టు

బేతంచెర్ల, ఆగస్టు 24: పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు దుర్గాపేటకు చెందిన సారా విక్రేతలను అరెస్టు చేసి 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్ శనివారం తెలిపారు. పట్టణంలో నాటుసారా స్థావరాలపై సిబ్బందితో దాడులు నిర్వహించగా.. హనుమాన్‌నగర్ చెందిన ఆవుల రామకృష్ణ ఆదర్శ పాఠశాల సమీపంలో సారా విక్రయిస్తుండగా అదుపులోకి తసుకుని, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. అదే విధంగా దుర్గాపేటకు చెందిన తాళూరి బాల సుంకన్నను సిద్దప్ప గుడి వద్ద అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులను డోన్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

అడ్డే లేని అక్రమాలు

వైసీపీ నాయకుల అడ్డదారి

సామూహిక మరుగుదొడ్డి, చావిడి, ప్రభుత్వ స్థలం కబ్జా



సామూహిక మరుగుదొడ్డి స్థలంలో నిర్మించిన పశువుల షెడ్, ఇన్‌సెట్‌లో చావిడి పక్కనే రూము

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం:


నేను కొత్తగా బాధ్యతలు చేపట్టానన్నారు. వైసీపీ నాయకుల కబ్జాపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి నివేదికలు తయారు చేసి కలెక్టరుకు పంపిస్తాం.- పవన్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు, కోవెలకుంట్ల

కోవెలకుంట్ల, ఆగస్టు 24: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుల అక్రమాలకు అడ్డే లేదు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని గ్రామంలోని సామూహిక మరుగుదొడ్డి, చావిడి స్థలం, ప్రభుత్వ స్థలం.. సొంతం చేసుకున్నారు. ఆ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు కూడా పుట్టించారు. దీంతో చేసేదేమీ లేక గ్రామ ప్రజలు కిమ్మనకుండా ఉండి పోయారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఇప్పటికైనా వైసీపీ నాయకుల అక్రమాలు బైటికి రావాలని, వాళ్లమీద చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు. కోవెలకుంట్ల మండలం పెద్దకొప్పెర్ల గ్రామంలో వైసీపీ మహిళా నాయకురాలు గ్రామంలోని సామూహిక మరుగుదొడ్డిని స్వాధీనం చేసుకొని పడగొట్టి ఆ స్థలంలో బండలు పాతి, పశువుల కొట్టం నిర్మించుకుంది. అంతేగాక ఈ నాయకురాలు గ్రామానికి చెందిన మునగాల రెడ్డిగారి రామిరెడ్డి 1939లో జనవరి 20న నిర్మించిన రెడ్డిచావిడి పక్క ఉన్న స్థలం ఆక్రమించి చిన్నరూము నిర్మించింది. ఆ రూముకు అప్పటి తహసీల్దారుతో పొజిషన్ సర్టిఫికెట్ కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. పొందినట్లు కూడా తెలుస్తోంది. 2013లో బీసీ జనార్దనరెడ్డి గ్రామ ప్రజల దాహం తీర్చేందుకు సొంత నిధులతో వేయించిన బోరు మీద అదే గ్రామానికి చెందిన మరో వైపీపీ నాయకుడి కన్నుపడింది. బోరు ఉన్న స్థలాన్ని కబ్జా చేసి అక్కడ రూము నిర్మించి పిండిమిషన్ ఏర్పాటు చేసి నిర్వహించుకు నేవాడు. కబ్జా చేసిన నాయకులపై చర్యలు తీసుకొని ఆ స్థలాలను ప్రభుత్వా నికి స్వాధీనం చేయా లని ఈ విషయంపై కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పాఠశాలల పరిశుభ్రతపై దృష్టి సారించండి

బేతంచెర్ల, ఆగస్టు 24: ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీవో వెంకన్న సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో సోమశేఖర్ అధ్యక్షతన హెచ్‌ఎంలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు ఎస్‌ఎంసీ చైర్మన్లకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమ, గురువారాల్లో టాయిలెట్లను ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, బుధ, శుక్రవారాల్లో ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లు పర్యవేక్షించాలని సూచించారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లదే బాధ్యత

సంజామల: పాఠశాలల మరుగుదొడ్ల బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, పాఠశాల యాజమాన్య కమిటీదేనని తహశీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంలతో పాఠశాలల అభివృద్ధి, మరుగుదొడ్ల పర్యవేక్షణపై అవగాహన ఏర్పాటు చేశారు. ఎంఈవోలు రాజయ్య, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉపాధ్యాయులకు పనిభారం తగ్గిస్తూ పాఠశాల యాజమాన్య కమిటీ వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు బాధ్యతలను అప్పగించనున్నారు. సీఆర్పీ బాషా పాల్గొన్నారు.

ఆ బాధ్యతలు సరి కాదు

రుద్రవరం: పాఠశాలల మరుగుదొడ్ల బాధ్యతల నుంచి తమను తప్పించాలని వెల్ఫేర్ అసిస్టెంట్లు కోరారు. శనివారం రుద్రవరంలో నిరసన వ్యక్తం చేసి, ఎంఈవోలు కోటయ్య, లక్ష్మికి వెల్ఫేర్ అసిస్టెంట్లు నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందించారు. ఈవోఆర్డీ శ్రీనివాసశర్మ, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామికి వెండి గద విరాళం

బేతంచెర్ల, ఆగస్టు 24: ఆర్‌ఎస్ రంగాపురం మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లకు భక్తులు వెండి గద ముఖ కవచాన్ని శనివారం ఈవో రామాంజనేయులుకు అందచేశారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన పట్నం బాశెట్టి కుమారుడు పట్నం వెంకటసుబ్బయ్య కేజీ వెండి ముఖ కవచం, తాడిపత్రి పట్టణానికి చెందిన వంకదార చిన్నమద్దిలేటయ్య 578 గ్రాముల వెండి గద విరాళంగా అందజేశారు. స్వామి, అమవార్లను దర్శనార్థం వచ్చే భక్తులు సమర్పించి అభిషేకం, గండదీపాలు, పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. స్వామివారి సేవా టికెట్ల లడ్డూ ప్రాదం కేశఖండన రూముల బాడుగుల ద్వారా రూ.5,37,944 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో తెలిపారు.


వెండి గదను విరాళంగా అందజేస్తున్న భక్తులు


వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

వెండి వస్తువులు విరాళం

బేతంచెర్ల, ఆగస్టు 24: గూటుపల్లి పాలుట్ల రంగనాథ స్వామికి దాతలు వెండి వస్తువులను విరాళంగా అందజేసినట్లు ప్రధాన అర్చకుడు విష్ణువర్ధనాచారి శనివారం తెలిపారు. డోన్ మండలం తాడూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి, సతీమణి సువర్ణలత సుమారు 56 తులాల వెండి హారతి పల్లెం, వెండి గంట సుమారు రూ.50వేలు విలువైన వెండి వస్తువులను అందజేశారని అన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 24: పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనాధరెడ్డి తెలిపారు.

శ్రావణ మాస పూజలు

చాగలమర్రి, ఆగస్టు 24: పెద్దమకానం వీధిలో వెలసిన సీతారామాలయంలో శనివారం వేద పండితుల ఆధ్వర్యంలో శ్రావణమాస పూజలు నిర్వహించారు. సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, ఆంజనేయస్వామి మాలదారులు హరికృష్ణ, చిన్నయ్య ప్రారంభించారు. టీడీపీ నాయకులు సల్లా నాగరాజు, ఓబులేసు, శేఖర్, రామచంద్ర, లక్ష్మన్న, ఆలయ కమిటీ సభ్యులు సుంకు పుల్లయ్య, మహిళలు పాల్గొన్నారు.

కృష్ణాష్టమికి ఏర్పాట్లు

రుద్రవరం, ఆగస్టు 24: మండలంలోని హరినగరం సమీపంలోని ఇస్కాన్ అహోబిళ దేవస్థానం నందు ఈ నెల 26న కృష్ణాష్టమి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇస్కాన్ అహోబిళం మేనేజర్ చంద్రశేఖదాస్ శనివారం తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.. కూచిపూడి కళానిధి గురువు వేదాంత రామలింగ శాస్త్రి ఆధ్వర్యంలో నృత్యనాటిక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఆగస్టు 24: మండలంలోని వాసాపురం, రుద్రవరంలో వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసాపురంలో అర్చకులు గోపిశర్మ, శివశర్మ అభిషేకంతో చేశారు. భక్తులు దర్శించుకున్నారు. వాసాపురంలో వెంకటేశ్వరస్వామి లక్ష్మి గోదాదేవి అమ్మవారు మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. మండలంలోని నరసాపురం, రుద్రవరంలో లక్ష్మినరసింహస్వామి ఆలయాల్లో అర్చకులు అభిషేకం, పూజలు నిర్వహించారు.


హరినగరం ఇస్కాన్ ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ


అన్నదానం చేస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు నరసింహులు

మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

దొర్నిపాడు, ఆగస్టు 24: మండలంలోని చాకరాజువేములకు చెందిన హరికృష్ణ మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ శనివారం వెళ్లరు. సమాచారం మేరకు దాడి చేశామని 17 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గ్రామాల్లో పేకాట, మద్యం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

సంజామల, ఆగస్టు 24: వసతి గృహం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని బీసీ సహాయ సంక్షేమ అధికారి ఆర్. ఓబులేసు సూచించారు. శనివారం ఉదయం సంజామల బీసీ వసతి తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మెనూ ప్రకారం భోజన వసతి కల్పిస్తున్నారా లేదా సౌకర్యాలు కల్పించారా లేదా సౌకర్యాల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి నుంచి ప్రణాళికాబద్ధంగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ చదివిస్తున్నారని వారి కోరికను నెరవేర్చాలని కోరారు. సంక్షేమ అధికారి మునిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పాలన: కోట్ల

డోన్, ఆగస్టు 24: సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రజల వద్దకే పాలన అందుతోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం ఓబులాపురం జెర్రికొండ లక్ష్మినరసింహ స్వామి ఆరాధన, పంచ ముఖి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బండలాగుడు పోటీలను ప్రారంభించారు. డోన్‌కు పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, తిమ్మయ్య యాదవ్, ఆర్‌ఈ నాగరాజు, భాస్కర్ నాయుడు, సీమసుధాకర్ రెడ్డి, ప్యాపిలి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య పాల్గొన్నారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

సమస్యలు పరిష్కరించండి

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి వీఆర్‌ఏల వినతి



వీఆర్‌ఏతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 24: తమ సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్ కోరారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాయంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వీఆర్‌ఏలకు నైట్‌డ్యూటీలు రద్దు చేయాలన్నారు. అటెండర్లు, రికార్డు అసిస్టెంట్లుగా, ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. నెలకు రూ. 26 వేలకు వేతనం పెంచాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు తలారి పెద్దబాలుడు, ఉన్నారు.

యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయండి : ఎంఈవో

కోవెలకుంట్ల, ఆగస్టు 24 : ఐఎంఎంఎస్ యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేయాలని ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య సూచించారు. శనివారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డి రాధికారెడ్డితో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల బాత్‌రూములు, మరుగుదొడ్ల ఫోటోల అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

పంటల నమోదు తప్పనిసరి

కోవెలకుంట్ల, ఆగస్టు 24: రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించాలని ఏవో నిరంజన్ సూచించారు. శనివారం మండల పరిధిలోని గుళ్లదుర్తిలో పంటలను పరిశీలించారు. ఏఈవో వెంకటేశ్వర్‌రెడ్డి, వీఏఏ శ్రీనివాసరెడ్డి, ఎంపీఈవో లావణ్య పాల్గొన్నారు.

భూ రీసర్వే సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి, ఆగస్టు 24: గత ప్రభుత్వం నిర్వహించిన భూసర్వేలో సమసలున్నాయని వాటిని పరిష్కరించాలని టీడీపీ నంద్యాల బీసీ సెల్ ప్రతినిధి సల్లా నాగరాజు పేర్కొన్నారు. శనివారం నూతన తహసీల్దార్ రవికుమార్‌కు కలిసి వినతి పత్రం సమర్పించారు. వీఆర్వో శ్రీనివాసులు, సీమాంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాష, టీడీపీ నాయకులు ఓబులేసు, రమణ, బాష తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

బనగానపల్లె, ఆగస్టు 24: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన మట్కా బీటర్‌ను అరెస్ట్ చేసినట్లు నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. రూ. 840 నగదు, మట్కా చీటీలను స్వాధీనం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేసీ కాలువలో 750 క్యూసెక్కుల నీటి ప్రవాహం

చాగలమర్రి, ఆగస్టు 24: కేసీ కాలువలో 750 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు ఏఈ జమాల్‌వలి తెలిపారు. శనివారం కేసీ కాలువ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. రాజోలి వద్ద 15వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని గేట్లను ఎత్తి కడప జిల్లాకు నీరు విడుదల చేశామని అన్నారు.

పశువుల వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఆగస్టు 24: పశువుల్లో వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ సూచించారు. శనివారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. గేదెలు, ఆవులు, ఎద్దుల్లో గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు.

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి

చాగలమర్రి, ఆగస్టు 24: పండ్ల తోటలు సాగు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా ఉపాధి పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం చాగలమర్రి ఉపాధి కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం టీఏలతో సమావేశం నిర్వహించారు. 360 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం కాగా 120 ఎకరాల్లో మాత్రమే రైతులు ముందుకు వచ్చారని అన్నారు. 100 శాతం సబ్సిడీతో రైతులకు మొక్కలను పంపిణీ చేస్తామని మూడేళ్ల పాటు పండ్ల తోటల సాగుకు ఉపాధి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. పక్కా గృహాల లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాల బిల్లులు కూడా జమ చేస్తామని వివరించారు.

స్థానికేతరులకు ప్రాధాన్యం ఇవ్వాలి

డోన్(రూరల్), ఆగస్టు 24: పంచాయతీ, సచివాలయ కార్యదర్శుల సాధారణ బదిలీల్లో స్థానికేతరులకు ప్రాధాన్యం ఇవ్వాలని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ నీలం చంద్రశేఖర్ నాయుడు కోరారు. శనివారం సాయంత్రం కార్యాలయంలో మాట్లాడుతూ స్థానికులను నియమిస్తే సమస్యలు వస్తాయని తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు పరిశీలించాలని అన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్(రూరల్), ఆగస్టు 24: హిందూ శ్మశాన వాటికలో అనాథ శవానికి ద్రోణాచలం సేవా సమితి సభ్యులు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనాథ శవాన్ని గుర్తించిన పోలీసులు ద్రోణాచలం సేవా సమితి సభ్యుల సాయం కోరడంతో వారు స్పందించారు. సంస్థ అధ్యక్షులు షాదీకానా రాజా, సభ్యులు గురుస్వామి, తాహేర్‌బాషా, పానీపూరి మురళి పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోండి


కొత్తపల్లిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

డోన్(రూరల్), ఆగస్టు 24: వేరుశనగలో తిక్క ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు జాగ్రత్త తీసుకోవాలని డోన్ ఏడీఏ అశోక్‌వర్దన్ రెడ్డి, ఏవో అబ్దుల్ షఫీ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని దేవరబండ గ్రామంలో వేరుశనగ పంటలను కొత్తపల్లి గ్రామంలో ఆహారం, పోషక భద్రత పథకం కింద కంది పంటలో సజ్జ సాగు క్షేత్రాన్ని పరిశీలించి, తెగుళ్ల నివారణకు రైతులు జిప్సం వాడాలని సూచించారు. అనంతరం దేవరబండ, ఉంగరానిగుండ్ల, కొత్తపల్లి రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అంధుల పాఠశాలకు విరాళం

కొలిమిగుండ్ల, ఆగస్టు 24: నంద్యాల జీవన జ్యోతి అంధుల పాఠశాలకు టీడీపీ నాయకులు రూ.15 వేల విరాళాన్ని శనివారం అందజేశారు డీఆర్ హోటల్ అధినేత, పేట్నికోట టీడీపీ నాయకులు యాతం సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి చేతులమీదుగా అందజేశామని సత్యనారాయణరెడ్డి తెలిపారు. నాయకులు బొట్టుస్వామి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల, ఆగస్టు 24: చదువు మధ్యలో మానేసినవారు ఓపెన్ టెన్త్, ఇంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సోమశేఖర్ శనివారం కోరారు. పట్టణంలోని ధరణి టౌన్‌షిప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 14 ఏళ్లు పైబడిన వారు, పది ఫెయిల్ అయిన విద్యార్థులు వినియోగించుకోవాలని అన్నారు. ఆదార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రాలతో పాఠశాల హెచ్‌ఎం ను సంప్రదించాలని సూచించారు.

చాగలమర్రి: సార్వత్రిక విద్య ద్వారా ఉన్నత చదువులు చదవవచ్చని ఎంఈవో-2 న్యామతుల్ల అన్నారు. ఆన్‌లైన్, సచివాలయాల ద్వార సార్వత్రిక విద్య కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువకుని, ఉన్నత చదువులకు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు.